నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, సోమవారం 9 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆశా కార్యకర్తలు, యూనియన్ నాయకులు (ఫైల్)

బీఆర్ఎస్ అధినేతతో తాతా మధు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆదివారం కలిశారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నందున సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎమ్మెల్సీ తాతా మధు కలిశారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్సీ తాతా మధు

'అమ్మా..' అనే పిలుపు వినపడగానే 'నేను న్నానమ్మా..' అంటూ పరుగెత్తుకొని వెళ్లి గర్భిణులు, బాలింతలకు అమూల్యమైన సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల జీవితాలు అంతులేని దుర్భరాన్ని ఎదుర్కొంటున్నాయి. అరకొర వేతనాల కారణంగా వారి కుటుంబాలు అర్ధాకలితో నెట్టుకొస్తున్నాయి. వైద్యారోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో ఎంతో కీలకంగా ఉన్న ఆశా కార్యకర్తలతో బారెడు పని చేయించుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వం.. కనీసం వారికి జానెడు జీతమూ ఇవ్వడం లేదు. ఇచ్చే అరకొర వేతనమూ సక్రమంగా అందించడం లేదు. కొండలు, గుట్టలు ఎక్కుతూ రెక్కలు ముక్కలు చేసుకొని చేసిన సర్వేలకు సైతం సరైన పారితోషికం ఇవ్వడం లేదు. ఇలా విరామం లేకుండా పనులు చేయించుకుంటున్న పాలకులు.. వేతనాలను సరైన సమయంలో ఇవ్వకుండా వారిని పస్తులు ఉంచుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించినా, దఫాలుగా ధర్నాలు చేసినా.. రేవంత్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. అదీగాక ఎన్నికల హామీలపైనా అసలు నోరు మెదపడం లేదు. దీంతో కాంగ్రెస్ సర్కారుపై కన్నెరచేసిన ఆశా కార్యకర్తలు.. ఈ నెల 10 హైదరాబాద్‌లో కమిషనరేట్ ముట్టడికి సిద్ధమవుతున్నారు.

– భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ)

ఆశాల ఆకలిగోస

- అరకొర వేతనాల కారణంగా అర్ధాకలితో ఆశా కార్యకర్తలు
- పనులు చేయించుకొని పస్తులుంచుతున్నారు..
- బారెడు పని చెప్పి జానెడు జీతమూ ఇవ్వడం లేదు..
- సర్వే పారితోషికమూ ఇవ్వకుండా ముప్పతిప్పలు
- ఎన్నికల హామీలపై నోరుమెదపని రేవంత్ ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కారుపై ఆశాల కన్నెర్ర.. దఫాలుగా ధర్నాలు..
- రేపు కమిషనరేట్ ముట్టడికి సిద్ధమవుతున్న ఆశా కార్యకర్తలు

పెండింగ్ బిల్లులు ఇవ్వాలంటూ భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు (ఫైల్)

గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న రేవంత్ ప్రభుత్వం.. వారి ఆకలిదప్పుల గురించి కనీసం గానూ ఆలకించడం లేదు. ఎండల్లో కొండలెక్కుతూ, గుట్టలు దిగుతూ.. వానల్లో నిండైన వాగులు దాటుతూ రెక్కలు ముక్కలు చేసుకుంటూ సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల ఆకలి బాధలను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోవడం లేదు. పల్స్‌పోలియో టీకాలు అందించడం మొదలుకొని లెప్రసీ సర్వే చేయడం, టీబీ రోగులకు మందులు అందించడం, గర్భిణులను సకాలంలో ఆసుపత్రులకు తీసుకెళ్లడం, ప్రసవానంతరం వారిని తిరిగి ఇళ్లకు తీసుకురావడం, అన్ని ఆరోగ్య సమస్యల్లోనూ ఆసరాగా నిలబడడం వంటి అమూల్యమైన సేవలను ఎంతో అంకితభావంతో అందిస్తున్న ఆశా కార్యకర్తలు చాలీచాలని వేతనాలతోనే కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు ఎన్నో వరాలు కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వారివైపు చూసిన పరిస్థితి కూడా లేదు. ధర్నాలు చేసినా కనీస స్పందన లేదు.

సర్వేల పారితోషికాలకూ ఎగనామం..

వైద్యారోగ్యశాఖలో ప్రతి పనినీ చేసుకొస్తున్న ఆశాలకు ప్రస్తుత పాలకుల కారణంగా పస్తులు తప్పడం లేదు. ఏకంగా సర్వేల పారితోషికాలకూ ఎగనామం పెట్టడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా కన్పిస్తోంది. ఆశాలు ఏటా 14 రోజులపాటు లెప్రసీ సర్వే చేస్తారు. అందుకు వారికి రోజుకు రూ.70 చొప్పున ప్రభుత్వం పారితోషికం ఇవ్వాల్సి ఉంది. గడిచిన మూడేళ్ల పారితోషికాలు ఇంకా బకాయిలుగానే ఉండిపోయాయి. పల్స్‌పోలియో సర్వే మూడు రోజులపాటు చేస్తారు. అందుకు రోజుకు రూ.200 చొప్పున అందాల్సిన పారితోషికం బకాయిలు ఏడాదిగా ఇవ్వడమే లేదు. ఇదేగాక టీబీ రోగుల నుంచి సేకరించిన తెమడ నమూనాలను ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు చేయించాలి. ఆరు నెలలపాటు బాధితులతో మందులు వాడించాలి. ఈ పనుల కోసం ఆశాలకు ఏడాదికి రూ.5,000 ఇస్తారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల దానికీ ఎగనామం పెట్టింది. పారితోషికం గురించి రాష్ట్ర అధికారులను అడిగితే.. హైదరాబాద్ నుంచి జిల్లాకు బడ్జెట్ ఇచ్చామని చెబుతున్నారని, జిల్లా అధికారులకు మొరపెట్టుకుంటే హైదరాబాద్ నుంచి రాలేదని చెబుతున్నారని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తుండడం దయనీయమైన విషయం.

ఎన్నికల హామీలపై మౌనం..

అయితే, ఆశాలకు ఇచ్చిన ఎన్నికల హామీలపై రేవంత్ ప్రభుత్వం మౌనం వహిస్తోంది. దీంతో కాంగ్రెస్ సర్కారుపై ఆశాలు మండిపడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామంటూ ఇచ్చిన హామీపై నిలదీస్తున్నారు. దానిని నెరవేర్చకపోగా.. కనీసం బకాయిలు విడుదల చేకపోవడం పట్ల గుర్రుగా ఉన్నారు. నెలకు రూ.9,750 చాలీచాలని వేతనం ఇవ్వడంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు అది ఎటూ చాలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

వెట్టిచాకిరీ చేస్తున్నాం..

ప్రభుత్వం ఇచ్చే వేతనం చాలా తక్కువ. పనులు మాత్రం రోజంతా చేయిస్తున్నారు. ఏ సర్వే వచ్చినా మాతోనే చేయిస్తున్నారు. బాక్స్ చేతపట్టుకొని విధులు రెక్కలు ముక్కలు చేసుకున్నా పూట గడవడం కష్టంగా ఉంటోంది. మూడేళ్లుగా సర్వే పారితోషికం ఇవ్వలేదు. రోజు వారీ విధుల కోసం సొంతంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.

–భూక్యా గంగ, ఆశా కార్యకర్త

25 శాతం బడ్జెట్ వచ్చింది..

సర్వే చేసిన ఆశా కార్యకర్తలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతానికి 25 శాతం బడ్జెట్ వచ్చింది. అంతవరకూ బిల్లులు క్లియర్ చేశాం. ఇంకా బడ్జెట్ రావాల్సి ఉంది. అది రాగానే మిగతా బిల్లులు చేస్తాం. మా వద్ద పెండింగ్ ఏమీ లేదు.

–డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో

ధరలకు అనుగుణంగా వేతనాలు లేవు..

పురిటి నొప్పులు మొదలైన గర్భిణులు.. 'అమ్మా..' అని పిలవగానే వాళ్లింట్లో వాలిపోతుంటాం. ఆసుపత్రులకు తీసుకెళ్లి తల్లీబిడ్డలను క్షేమంగా తిరిగి తీసుకొస్తాం. ఇలాంటి ముఖ్యమైన సేవలందిస్తున్న మాకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గుట్టలెక్కి మరీ టీకాలు వేస్తాం. కానీ సరైన వేతనాలకు నోచుకోలేకపోతున్నాం.

–ధర్మపురి దేవి, ఆశా కార్యకర్త

మట్టి ఇటుకలను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

సహజ వనరులతో ఇటుకల తయారీ

వాటితో అందమైన కట్టడాలూ నిర్మించుకోవచ్చు

మట్టి ఇటుకల పరిశీలనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

భద్రాచలం, డిసెంబర్ 8: గ్రామంలో లభించే సహజ వనరులైన మట్టి, సున్నం, సిమెంటు కలిపి తయారుచేసిన ఇటుకలతో అందమైన కట్టడాలను నిర్మించుకోవచ్చని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. అవసరమైన హంగులతో ఇళ్లను తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. భద్రాచలంలో ఆదివారం పర్యటించిన ఆయన.. ఇక్కడి ఐటీడీఏ వైటీసీలో తక్కువ ఖర్చుతో పర్యావరణానికి అనుకూలంగా మంచి మన్నిక కలిగిన నిర్మాణాల కోసం తయారుచేస్తున్న మట్టి ఇటుకలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో పర్యావరణానికి హాని కలిగించకుండా మట్టితో అందమైన నివాసగృహాలు నిర్మించుకొని జీవనాధారం సాగిస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని అన్నారు. పదికాలాలపాటు జీవించవచ్చునని అన్నారు. ఇటుకల తయారీలో గతంలో కొందరికి శిక్షణ ఇచ్చామని, శిక్షణ తీసుకున్న గిరిజనులు వారి వారి గ్రామాల్లో అవగాహన కల్పించి మట్టి ఇటుకల తయారీకి ముందుకొస్తున్నారని అన్నారు. పంచాయతీ ఈవో శ్రీనివాస్, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ మ్యూజియం సందర్శన..

ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియాన్ని కలెక్టర్ జితేశ్ ఆదివారం సందర్శించారు. మ్యూజియంలో నిర్మిస్తున్న గడ్డి ఇళ్లను, స్టాళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాట్లు చేయాలని, ప్రధానంగా గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా అన్ని హంగులూ ఉండాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు డేవిడ్‌రాజ్, హరీశ్, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, స్రవంతి, సురేందర్, హేమంతిని, నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రికి దేవాదాయ శాఖ కమిషనర్

అంతరాలయంలో స్వామివారి దర్శనం

రామాలయంలో పూజలు చేస్తున్న కమిషనర్ శ్రీధర్

భద్రాచలం, డిసెంబర్ 8: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలైన లక్ష్మీ తాయారు, అభయాంజనేయస్వామి ఆలయాల్లో కమిషనర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు.

లడ్డూ, పులిహోర తయారీ కేంద్రం పరిశీలన..

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎండోమెంట్ కమిషనర్ శ్రీధర్.. ఈవో రమాదేవితో కలిసి ఆలయ పరిసరాలు పరిశీలించారు. అనంతరం లడ్డూ, పులిహోర తయారీ కేంద్రాన్ని సందర్శించి ప్రసాదాలు నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం మిథిలా స్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్డును కూడా పరిశీలించారు. దేవస్థానం అధికారులు రవీందర్, శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, సాయిబాబా, స్థలశాయి తదితరులు పాల్గొన్నారు.

రోళ్ల పాడును పునఃప్రారంభించాలి

- తలాపునే ప్రాజెక్టున్నా.. నీళ్లు మాత్రం పారుగు జిల్లాకా?
- ముందుగా ఏజెన్సీ ప్రాంతాలకే సాగునీరు అందించాలి
- రెండో రోజు పాదయాత్రలో సేవాలాల్ సేన నాయకులు

టేకులపల్లికి చేరుకున్న సేవాలాల్ సేన పాదయాత్ర

ఇల్లెందు, డిసెంబర్ 8: రోళ్లపాడు ప్రాజెక్టును పునఃప్రారంభించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివనాయక్ డిమాండ్ చేశారు. తమ తలాపునే సీతారామ ప్రాజెక్టు ఉన్నా నీళ్లను మాత్రం పొరుగు జిల్లాకు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. సీతారామ నుంచి మొదటగా ఏజెన్సీ పారతాలకే సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లెందు, భద్రాచలం ఏజెన్సీలకు సీతారామ ప్రాజెక్టు నీళ్ల సాధన కోసం సేవాలాల్ సేన చేపట్టిన పాదయాత్ర ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఇల్లెందులో శనివారం మొదలైన ఈ యాత్ర ఆదివారం టేకులపల్లి మండలానికి వచ్చింది. టేకులపల్లి మండల కేంద్రంలోని బోడు రోడ్డు సెంటర్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో శివనాయక్ మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గ రైతుల కోసం, ముఖ్యంగా భద్రాద్రి జిల్లా రైతుల కోసం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయితే ఇక్కడ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా తొలుత ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరు అందించకుండా మైదాన ప్రాంతాలకు అందించేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ముందుగా భద్రాద్రి జిల్లాకు నీళ్లు ఇచ్చాకే ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అలాగే గత ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన రోళ్లపాడు ప్రాజెక్టును పునఃప్రారంభించి డిమాండ్ చేశారు. ఇల్లెందు ఏజెన్సీలోని ఇల్లెందు, టేకులపల్లి, బయ్యారం, గార్ల, కామేపల్లి, కారేపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలతోపాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో సేవాలాల్ సేన నాయకులు, బీఆర్ఎస్ నేతలు ఇస్లావత్ నామా నాయక్, బోడ బాలునాయక్, మాలోత్ పూలసింగ్‌నాయక్, కృష్ణనాయక్, బానోత్ హుస్సేన్ నాయక్, అంగోత్ ఆంజనేయులు, సతీశ్, వంశీ, వీరన్న, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మన వాటా కోసం పోరాడుదాం..

- ఐక్యతతో లక్ష్యసాధన దిశగా పోదాం..
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

కూసుమంచి, డిసెంబర్ 8: మాదిగలు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లు అమలు కావాలంటే అంతా సమష్టిగా ఉండి పోరాటం సాగించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. మాలలకు మనం వ్యతిరేకం కాదని, మన వాటా కోసం మాత్రమే వారితో విభేదిస్తున్నామని అన్నారు. ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగకు మద్దతుగా ఉండి మన సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. కూసుమంచిలో ఆదివారం జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనం, మన భోజనాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురై అనేక ఇబ్బందులు పడిన మనం ఎన్నో ఉద్యమాల అనంతరం సాధించుకున్న వాటా అమలయ్యే వరకు అలుపెరగని పోరాటం చేయాల్సి ఉందన్నారు. ఎవరికీ వ్యతిరేకం కాకుండా మన వాటా ప్రకారం అన్నిరంగాల్లో పట్టు సాధించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని కార్యక్రమాల్లో అంతా సమష్టిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల బాధ్యులు పోలెపంగు ముత్తయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చేకూరి రమేశ్, డాక్టర్ గోపి, మాజీ ఎంపీడీవో గద్దల చంద్రయ్య, స్థానిక నాయకులు, మాజీ ఎంపీపీలు గురవయ్య, ముత్తయ్య, భరత్‌చంద్ర, ఉపేందర్, అంబేద్కర్, పరశురాం పాల్గొన్నారు.

ఖమ్మంలో నేడు, రేపు సైన్స్ ఫెయిర్

- ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు
- 486 మంది విద్యార్థులు.. 119 ఎగ్జిబిట్లు.. 16 కమిటీలు..

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఈవో, ఎంఈవోలు, సంఘాల బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: 'విద్యార్థుల్లోని మేధస్సు వికసించాలి. వారు జ్ఞాన సంపన్నులుగా ఎదగాలి. సరికొత్త ఆవిష్కరణలు, పరిశోధనల వైపుగా ముందుకు సాగాలి.' అనే లక్ష్యాల సాధనలో భాగంగా ఖమ్మంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రదర్శన ప్రాంగణానికి డాక్టర్ విక్రమ్ సారాబాయిగా నామకరణం చేశారు. ఈ రెండు రోజులపాటు సాయంత్రం వేళల్లో హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ తదితర ప్రాఖ్యాత సంస్థల్లోని శాస్త్రవేత్తలు సందేశాలిస్తారు. ఈ ప్రదర్శన నిర్వాహక కమిటీ సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. డీఈవో సోమశేఖరశర్మ, ఎంఈవోలు శైలజాలక్ష్మి, శ్రీనివాస్, రాములు, వీరస్వామి, సైన్స్ ఆఫీసర్ జగదీష్, సీఎంవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్స్, సీనియర్స్ విభాగాలు..

ఈ ప్రదర్శనలో 10 నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొంటారు. 10 నుంచి 14 ఏళ్లలోపు వారిని జూనియర్లుగా, 15 నుంచి 17 ఏళ్లలోపు వారిని సీనియర్లుగా పరిగణిస్తారు. ఫుడ్, హెల్త్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్, న్యాచురల్ ఫామింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మ్యాథమేటిక్ మోడలింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రీసోర్స్ మేనేజ్‌మెంట్ – అంశాల ఇతివృత్తంగా నమూనాలను విద్యార్థులు ప్రదర్శిస్తారు. ఇన్‌స్పైర్‌కు 119 ఎగ్జిబిట్లు ఎంపికయ్యాయి. సైన్స్ ఫెయిర్‌కు 486 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉత్తమ ప్రదర్శనల ఎంపికకు 32 మందితో కూడిన 16 కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ ప్రదర్శనలను మొదటి రోజున (9న) రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం త్రీ టౌన్ లోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు తిలకించవచ్చు. రెండో రోజున (10న) ఖమ్మం అర్బన్, వన్‌టౌన్, టూటౌన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు తిలకించవచ్చు.

ఎకరానికి రూ.15 వేల కోసం ఓటేస్తే.. ఉన్న రూ.10 వేలు పోయాయి

- ఏడాది కాలంగా పంటల పెట్టుబడికి రైతుభరోసా అందడం లేదు
- ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు కాలేదు
- సీపీఎం ఖమ్మం డివిజన్ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 8: రైతుబంధు కింద ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు వస్తాయని రైతులు ఓటు వేస్తే ఉన్న రూ.10 వేలూ పోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సు తప్ప మిగిలిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు కాలేదని విమర్శించారు. ఖమ్మం నగరంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతుల పంటల సాగుకు పెట్టుబడిని అందించే రైతుభరోసా పథకాన్ని ఏడాది కాలంగా అమలు చేయడం లేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ.2,500 వంటి అనేక హామీలు అమలుకు నోచుకోవడం లేదని ధ్వజమెత్తారు. 3 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ.. హామీగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. కొడంగల్‌లో ఫార్మాసిటీ పేరుతో మూడు వేల ఎకరాల గిరిజన భూములను బలవంతంగా లాక్కునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. అనంతరం పార్టీ డివిజన్ కార్యదర్శిగా వై.విక్రమ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కల్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనకపోతే ఉద్యమిస్తాం: బీఆర్ఎస్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెనుబల్లి, డిసెంబర్ 8: మండలంలోని ఏరుగట్లలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే ఉద్యమిస్తామని పెనుబల్లి బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని ఏరుగట్ల లోని ధాన్యం రైతులు ఆరబోసిన స్థలాలను ఆదివారం వారు పరిశీలించారు. అక్కడే రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను, గోడును బీఆర్ఎస్ నాయకులకు వివరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఎటువంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. నగదును కూడా నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేసినట్లు వివరించారు. కానీ ఇప్పుడు వడ్లలో రకాలు, రైతుల్లో విభజనలు తెస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయకుండా తిరకాసులు పెడుతోందని దుయ్యబట్టారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు, చెక్కిలాల లక్ష్మణరావు, మండపు అశోక్, కోటగిరి సుధాకర్‌రావు, రామారావు, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, గోవిందరావు, గౌస్ పాషా, శ్రీను, గిరిజ, శ్రీను పాల్గొన్నారు.